# తేప్వక్కడుంది

• రాజా •

## "ఒక్క పది వేలుంటే సర్దుతావా?" ఆశ్చర్యంగా చూశాను రమణవైపు "జోక్ చేస్తున్నావా?" అన్నాను.

"లేదు సీరియస్‌గానే అడుగుతున్నాను. ఇదే ఆఖరి అప్పు. ఈ దెబ్బతో తాడో పేడో తేలిపోతుంది అన్నాడు వాడు సీరియస్‌గా.

ఓ క్షణం పాటు ఏమీ మాట్లాడలేకపోయాను. ఓ వైపు కోపం కట్టలు తెంచుకుని వస్తుంటే ఏ మాత్రం నోరుజారకూడదన్న నా ప్రయత్నం నాలు గైదు నిముషాల మానసిక సంఘర్షణ తర్వాత ఫలించింది.

"ఏంట్రా మాట్లాడవ్?" అన్నాడు వాడే వెయిట్ చేసి.

"చూడు రమణా! మరోలా అనుకోకు. నీకు ఉద్యోగం లేదు. నీ బాధ అర్థం చేసుకోగలను. ఇప్పటికే చాలా ఇచ్చాను. అఫ్‌కోర్స్ అన్ని సార్లు చిల్లర చిల్లరగానే కావచ్చు. కానీ అదే పది పదిహేను వేల దాకా అయి ఉంటుంది. మన స్నేహం ముందు అదెంత అని ఎప్పుడూ సరిగ్గా కౌంట్ చేసుకోలేదు. రెంటల్ లైబ్రరీ అన్నావు, వీడియో లైబ్రరీ అన్నావు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ అన్నావు, కేటరింగ్ అన్నావు, ఫ్లాట్‌లు అన్నావు, టేక్ ప్లాంటేషన్ అన్నావు, రకరకాల బిజినెస్‌ల పేర్లు చెప్పావు. నేనెప్పుడూ డీటెయిల్స్ అడగలేదు. నువ్వు బాగుపడితే చాలనుకున్నాను. ఇప్పటిదాకా పైన చెప్పిన ప్రతిదీ క్లోజ్ చేసే నేవు ఏదీ పట్టుమని రెండు మూడు నెలలు కూడా చెయ్యలేదు. ఈ లెక్కన ఎక్కడ తేల్తావు చెప్పు?' అడిగాను సాధ్యమైనంత సహనంగానే.

వాడూ తొణకలేదు.

"రాజా! నేనొప్పుకుంటున్నాను. నువ్వు చెప్పిందంతా కరక్టే. కానీ నేను కూడా సిన్సియర్‌గానే ట్రై చేశాను. కష్టపడి పైకొద్దామని కానీ ఆ బిజినెస్‌లు నాకు ఒంటపట్టలేదో లేక నేను వాటికి సరికి రానో మొత్తానికి కలిసి రాలేదు. కసి మాత్రం పెరిగింది. ఈసారి మాత్రం నా గురి తప్పదు. ఖచ్చితంగా సక్సెస్ అవుతాను. నీ డబ్బు మొత్తం వడ్డీతో సహా తీర్చేస్తాను. ప్లీజ్" అన్నాడు.

"ఏం చేద్దామనుకుంటున్నావీసారి?"

"చెప్తేగానీ ఇవ్వలేవా?"

ఛుర్రుమని మండింది ఒళ్ళు. తమాయించుకున్నాను. అయినా ఆ అహంకారం ఏంటి "నా దగ్గర డబ్బు తీసుకుంటూ" అదే మాటన్నాను వాడితో.

"చూడు రమణా! అప్పు అనేది హక్కు కాదు, ఒక సౌకర్యం. ఆఖరికి ప్రజల ఆస్తులుగా భావించబడుతున్న నేషనలైజ్డ్ బ్యాంకుల్లో కూడా తగిన ఆధారాలు చూపించనిదే అప్పు ఇవ్వరు. ఆధారాలతో పాటు తగిన నమ్మకాన్ని కూడా కలిగించాల్సి ఉంటుంది".

•••

**అప్పు అనేది హక్కు కాదు. ఒకసౌకర్యం.**

•••

ప్రతి వాక్యం, ప్రతి అక్షరం దాని వెనకనున్న భావంతో సహా అర్థం అయింది వాడికి. ఆ సంగతి స్పష్టంగా తెలుస్తూనే వుంది.

"సారీ! వస్తాను"

ఆపే ప్రయత్నం చెయ్యలేదు నేను. ఆ తర్వాత వాడు కనిపించలేదు. రెండు సంవత్సరాలదాకా!

మొదట్లో చాలా ఫీలయ్యాను వాణ్ణి హర్ట్ చేశానేమోనని.

తర్వాత ఆ మాత్రం డోసు తప్పదులే అని అనిపించింది. తర్వాత్తర్వాత అన్నీ మర్చిపోయాను.

తిరిగి ఇవేవీ గుర్తు రాలేదు. వాడు కనిపించిన ఓ అరగంట దాకా!

ఆ రోజు ఇంటి ముందు కారు ఆగగానే తుళ్ళిపడ్డాను. అందులోనుంచి దిగింది రమణ అని తెలియగానే ఆశ్చర్యపడ్డాను. వాడే వచ్చి పలకరించగానే ఇంకా ఏవీ మనసులోకి రాలేదు.

"ఏరా ఎలా ఉన్నావు?" అన్నాను.

"కనిపించటంలే" అన్నాడు.

నిజంగా చాలా గొప్పగా ఉన్నాడు. నీట్‌గా పాలిష్ చేసిన షూస్, బాగా ప్రెస్ చేయబడిన బట్టలు, ఖరీదైన రిమ్‌లెస్ కళ్ళజోడు, గోల్డ్ వాచ్, గోల్డ్ చెయిన్, రింగ్స్ చూడగానే ఎంతటి వాడైనా లేచి మర్యాద చేసే లెవెల్లో ఉన్నాడు.

"పద మాట్లాడుకుందాం" అంటూ లాక్కుపోయాడు.

కార్లో ప్రయాణం చేస్తుంటే గుర్తొచ్చింది మేం విడిపోయిన సంఘటన. మౌనంగా అయిపోయాను గమనించినట్టున్నాడు వాడు.

"గతం మర్చిపో... అదిగో ఆ కనిపిస్తోందే ఆ

# సరదాకథలు

ఫ్లాట్... 'విన్ననే కొన్నా... రా మూర్దువుగాని''

ఫర్నిచరు అదీ అంతా సిద్ధంగా ఉంది. కూర్చొని స్థిమిత పడ్డాక అడిగాను.

''ఏం బిజినెస్?''

''ఫైన్ రియంబర్స్‌మెంట్''


''అంటే?'' అడిగాను ఆశ్చర్యంగా.

''లోకల్ రైల్లో టికెట్ లేకుండా ప్రయాణం చేసే వారికి ఫైన్ వేస్తారుగా. ఆ రశీదు తీసుకొచ్చి చూపిస్తే ఆ ఎమౌంట్ వాపసు వేయబడుతుంది''

''దాని వల్ల నీకు కలిగే లాభం?''

''అలా అందరికీ ఇవ్వబడదు. నా దగ్గర మెంబర్లుగా చేరిన వారికి మాత్రమే మెంబర్‌షిప్ నెలకి పది రూపాయలు''.

నాకసలు అర్థం కావటం లేదు. ఆ స్ట్రాటజీ ఏమిటో అదే అడిగాను.




''ఎలా వర్కవుట్ అవుతుంది నీకు?'' అని.

''నా దగ్గిర పదిమంది మెంబర్లు చేరారనుకో పది ఇంటూ పది... నెలకి వందరూపాయలు ఆదాయం. ఈ పది మందిలో పెట్టుబడి వాళ్ళు టూ పర్సెంట్. నెలకు నాలుగుసార్లు చెకింగ్ అయితే గొప్ప. అలా వేసుకున్నా పదికి టూ పర్సెంట్ ఈక్వల్ టు పాయింట్ టూ. పాయింట్ టూ ఇంటూ ఫోర్ ఈక్వల్ టూ పాయింట్ ఎయిట్. అంటే పది మందిలో నెలకు పెట్టుబడేది పాయింట్ ఎయిట్ పర్సెంట్ ఇంటూ వాళ్ళపైనే యాభై రూపాయలు అంటే మనం రియంబర్స్ వేసేది నలభై రూపాయలు. ఇన్‌కం వంద. ఎక్స్‌పెండిచర్ నలభై.''

నోరు తెరుచుకుని వింటున్నాను.

''హైదరాబాద్‌లాంటి ఊళ్ళో లోకల్ ట్రెయిన్స్‌లో ప్రయాణం చేసేవాళ్ళు రోజుకి యాభైవేలని ఓ అంచనా. అందులో సగానికి సగం నిజాయితీపరులే అయితే మిగిలిన సగం ఎగ్గొట్టేసిన బాపతేకదా. పదిమంది మెంబర్లకి అరవై రూపాయల పద్ధతిలో మన ఆదాయం అయితే ఇరవై అయిదువేల మందికి. .. ఒక నెల్లో లక్షాయాభై వేలు.''

గుండె ఆగినంత పనైంది వాడి లెక్కకి. వాడు చెప్పుకుంటూ పోతూనే ఉన్నాడు వాడి ధోరణిలో.

''పికప్ అవటానికి రెండు మూడు నెలలు టైమ్ పట్టినా తర్వాత బాగా ఊపు అందుకుంది. నేనిందాక చెప్పింది హైద్రాబాద్‌లాంటి సిటీ గురించి. అదే బొంబే, ఢిల్లీ, కలకత్తా అయితే ఎంతొస్తుంది. .. ఆలోచించు?''

యావరేజ్‌న రెండు లక్షలు వేసుకున్నా రెండు సంవత్సరాల్లో 48 లక్షలు. కళ్ళు గిర్రున తిరిగినట్టయింది.

''జనాలకి ఎలా తెలుస్తుంది... పబ్లిసిటీ ఇస్తే నిన్ను పట్టుకోరా?'' అని అడిగాను.

''ఇలాంటి వాటికి మౌత్ పబ్లిసిటీయే చాలు. జనాలకి ఓ చిన్న షార్ట్‌కట్ దొరికితే చాలు. అందులోంచి వెళ్తారు. పైగా లోకల్ ట్రెయిన్‌లో టిక్కెట్లు కొనవద్దు అని నేనెక్కడా చెప్పలేదు. మీరు మా మెంబర్లయితే మీరు కట్టిన ఫైన్ వాపస్ ఇవ్వబడుతుంది అన్నాను.''

''అది ఒక విధంగా టిక్కెట్టు కొనవద్దని చెప్పినట్టేగా!?''

''ఇన్ డైరెక్ట్‌గానే కదా?''

''మరి పట్టుకోలేదూ పోలీసులు...?''

''అదే మన వ్యవస్థ.. నేనెక్కడా డైరెక్ట్‌గా ప్రచారం చెయ్యలేదు. నా దగ్గర రియంబర్స్‌మెంట్ తీసుకున్నప్పుడు నీ బుర్రలో వచ్చిన తప్పుడు ఆలోచన ఇది. దానికి నేనెలా బాధ్యుణ్ణవుతాను? ముందు నీతి నీలో ఉండాలి. అదీగాక మన దగ్గరికి చెకింగ్‌కి వచ్చినా ఏ ఆధారాలు దొరుకుతాయి? ఫైన్ చలాన్లు రియంబర్స్ వేయబడ్డ వెంటనే చించివేయబడతాయి. ఇక మెంబర్‌షిప్ సీట్‌లు కష్టమర్ల దగ్గర ఉంటాయి. వాటి కాపీలు కూడా పెట్టుకోలేదు నేను. అంతా క్యాష్ హోండ్లింగ్... సో... ఉన్నపాటున నేను అదృశ్యం అయిపోయినా ఎప్పుడూ సేఫే'' అన్నాడు.

''ఇంత నెట్‌వర్క్ సక్సెస్‌ఫుల్‌గా ఎలా జరుగుతుందనుకున్నావ్?''

''చెప్పానుగా మన వ్యవస్థేనని. ఎగ్గొట్టేసి బ్రతుకుదామన్నది ప్రజల వీక్‌నెస్. ఏవో నాలుగు కేసులు రికార్డు కోసం పట్టుకుందాం అనుకునే పోలీసులు దానికూడా లంచాలిస్తే వదిలేసే వాళ్ళు చాలా మంది. ఇక రైళ్ళలో కూడా అంతే... మొక్కుబడి చెకింగ్‌లే తప్ప దేశానికి రావల్సిన సొమ్ము ఇలా ఎగ్గొట్టబడుతోంది అనే సిన్సియారిటీతో చెక్ చేసేవాళ్ళెంత మంది? ఇవే... ఈ బలహీనతలు. లొసుకులే నా వ్యాపారానికి పెట్టుబడి'' అన్నాడు రమణ కూల్ డ్రింక్ ఆఫర్ చేస్తూ.

''ఇలా చేస్తూనే ఉంటావా?'' అన్నాను భయంతో.

''లేదు. ఇది వెధవపని అని నాకు తెలుసు. ఇదే కంటిన్యూగా చేస్తే ఏదో రోజు పట్టుబడి పోతానని తెలుసు. అందుకే నా టార్గెట్‌కి నేను చేరగానే ఆపేసి తిరిగి మన ఊరొచ్చి బ్యాంకులో వేసుకుని సెటిల్ అయిపోయాను. బ్యాంక్ ఇచ్చే ఇంట్రస్ట్ చాలు నా జీవితాంతం కాలు మీద కాలేసుకొని బ్రతకడానికి. అన్నట్టు నీ బాకీ పదిహేనువేలుకి నీపేర్న బ్యాంక్‌లో ఇవాళే వేసేశాను పాతికవేలు.''

ఒళ్ళు జలదరించింది ఒక్కసారిగా... తప్పెక్కడుంది? బలహీనతలున్న ప్రజలదా లొసుగులున్న యంత్రాంగానిదా? ఇంతటి తెలివితేటలున్న యువకులకు తగిన ఉపాధి కల్పించలేని ప్రభుత్వానిదా?

నా ఆలోచన, నా వ్యక్తిత్వం, నా వివేకం, నా సంస్కారం ఇవేవీ వీటి గురించి ఆలోచించడానికి చాలవేమోననిపించింది.

మాట్లాడకుండా వచ్చేశాను వెనక్కి. ●